# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-05-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో రక్షణ రంగ తయారీ ప్రాజెక్టులకు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు.**

2. **రైతు ఉత్పత్తులను వినియోగదారులకు నేరుగా అందించేందుకు మెరుగైన వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.**

3. **నీట్ యూజీ-2026 పరీక్షకు సంబంధించిన పునఃపరీక్షను వచ్చే నెల 21వ తేదీన నిర్వహించనున్నామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు.**

4. **గోదావరి డెల్టా అభివృద్ధి కోసం 14 కోట్ల రూపాయలతో సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.**

==========================

రాష్ట్రంలోని శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో రక్షణ డ్రోన్ తయారీ రంగాలకు సంబంధించిన మూడు ప్రాజెక్టులకు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు శంకుస్థాపన చేశారు. అలాగే అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్టు -భావీజూ నిర్మాణ పనులను ప్రారంభించారు. అదే విధంగా డ్రోన్ సిటీలో ఏర్పాటు కానున్న పలు డ్రోన్ పరిశ్రమల ప్రాజెక్టులకు కూడా దృశ్య మాధ్యమం విధానంలో శంకుస్థాపనలు నిర్వహించారు. 15 వేల 803 కోట్ల విలువైన ప్రాజెక్టుల ద్వారా సుమారు 7 వేల 500 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ,

వాయిస్ 38 సెకన్లు

అంతకుముందు ముఖ్యమంత్రి మాట్లాడుతూ,

వాయిస్ 36 సెకన్లు

-------------------------

రైతులు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించేందుకు మెరుగైన వసతులు కల్పించడమే

ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరులోని పట్టాభిపురంలో నిర్మించనున్న రైతు బజార్‌కు కేంద్ర మంత్రి ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన రైతు బజార్ నిర్మాణంతో రైతులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు, ప్రజలకు నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. త్వరితగతిన రైతు బజార్ నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని కేంద్ర మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 27 సెకన్లు

---------------------------

నీట్ యూజీ--2026 పరీక్షకు సంబంధించిన రీ ఎగ్జామినేషన్ – పునఃపరీక్షను వచ్చే నెల 21వ తేదీన నిర్వహించేందుకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఏర్పాట్లు చేస్తోందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు. ఢిల్లీలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన ఈరోజు మాట్లాడుతూ, విద్యార్థుల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. పునఃపరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు అడ్మిట్ కార్డులు జూన్ 14వ తేదీ నాటికి అందుబాటులోకి వస్తాయన్నారు. అలాగే వచ్చే ఏడాది నుంచి ప్రస్తుతం అమల్లో ఉన్న ఓఎంఆర్ విధానానికి బదులుగా కంప్యూటర్ ఆధారిత పరీక్ష సీబీటీ విధానంలో నీట్ యూజీ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

---------------------------

గ్లోబల్ ట్రావెల్ మార్కెట్ -- జీటీఎం సంస్థ 2026 గానూ ఆంధ్రప్రదేశ్ ను "ఉత్తమ పర్యాటక ప్రచార రాష్ట్రం"గా ఎంపిక చేసిందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. జూన్ 4న కేరళం లోని తిరువనంతపురంలో నిర్వహించే కార్యక్రమంలో "మెట్రో ఎక్స్‌పెడిషన్ – జీటీఎం టూరిజం అవార్డు 2026" అందుకోనున్నట్లు మంత్రి ఒక ప్రకటనలో తెలిపారు.పర్యాటక రంగంలో వినూత్న సంస్కరణలు చేపట్టామని తెలిపారు. హోమ్ స్టేలు, కారవాన్ టూరిజం, డిజిటల్ ప్రచారం, పర్యాటక ఉత్సవాల నిర్వహణతో రాష్ట్రానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందన్నారు. ఈ అవార్డు ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగ అభివృద్ధికి నిదర్శనమని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.

---------------------------

అపర భగీరథుడుగా పేరు గాంచిన సర్ ఆర్థర్ కాటన్ జయంతి ఈరోజు. రాష్ట్ర ప్రజలు ముఖ్యంగా రైతులు నిత్యం తలచుకునే ఆర్థర్ కాటన్ 1803 మే 15వ తేదీన ఇంగ్లండ్లో జన్మించారు. భారతదేశంలో పనిచేసేందుకు కాటన్ కు బ్రిటిష్ ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఉభయగోదావరి జిల్లాలకు దుఃఖ దాయినిగా ఉన్న గోదావరి నదికి ధవళేశ్వరం వద్ద ఆనకట్ట కట్టి గోదావరి జలాలను పంటచేలకు అందించే వరప్రదాయినిగా మార్చారు. గోదావరి నీటికి అడ్డుకట్ట వేసి పంట భూములను సస్యశ్యామలం చేసిన సర్ ఆర్థర్ కాటన్ ను ఉభయ గోదావరి జిల్లాలో నేటికీ అనేక గ్రామాల్లో ఆయన విగ్రహాలను పెట్టి ప్రజలు స్మరిస్తూనే ఉన్నారు.

కాటన్ జయంతి సందర్భంగా సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు నివాళులర్పించారు. కాటన్ తన దూరదృష్టితో గోదావరి డెల్టాకు ఆనకట్ట కట్టి లక్షలాది రైతు కుటుంబాలకు వెలుగునిచ్చారని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి, సమర్థ నీటి నిర్వహణకు కాటన్ దొరనే స్ఫూర్తి అని పేర్కొన్నారు

-------------------------

సర్ ఆర్థర్ కాటన్ జయంతిని పురస్కరించుకుని విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆయన సేవలను స్మరించుకున్నారు. కాటన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, సర్ ఆర్థర్ కాటన్ ధవళేశ్వరం, కృష్ణా బ్యారేజీల నిర్మాణంతో పాటు ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లో కాలువల వ్యవస్థను అభివృద్ధి చేసి వ్యవసాయ రంగానికి అపార సేవలందించారని కొనియాడారు.

కాటన్ స్ఫూర్తితో ధవళేశ్వరం బ్యారేజికి కొత్త గేట్ల ఏర్పాటు కోసం 150 కోట్లకు పైగా నిధులు కేటాయించామన్నారు. అలాగే డెల్టా అభివృద్ధి కోసం 14 కోట్ల రూపాయలతో లైడార్ సర్వే ఆధారంగా సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నామని మంత్రి తెలియజేస్తూ..

వాయిస్ 35 సెకన్లు

======================